గోదాముల వద్ద నిఘాను

నిరంతరాయంగా కొనసాగించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ముమ్మిడివరం : భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ యంత్రాలు భద్ర పరిచిన గోదాముల వద్ద పటిష్ట పర్యవేక్షణ నిఘాను నిరంతరాయంగా కొనసా గించాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శు

క్లా ఆదేశించారు. స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గోదాములో ఉన్న ఈవీఎం, వీవీప్యాట్లను శుక్రవారం రెవెన్యూ, ఎన్నికల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ముందుగా గోదాంకు వేసిన తాళం సీలును పరిశీలించి గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు వివి ప్యాడ్లను గోదాం కండిషన్స్, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను భద్రతా చర్యలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ యంత్రాలు భద్రతకు పటి ష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను సమర్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈవీఎంలు, వివి ప్యాడ్లు భద్రత కొరకు 24 గంటలూ పోలీసు, సెక్యూరిటీ గార్డులు గిడ్డంగి వద్ద తగిన భద్రత కొరకు పటిష్టమైన పర్యవేక్షణ నిఘా చర్యలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు స్థానిక తహసిల్దార్ పీహెచ్ విజయశ్రీ, జిల్లా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇంజనీర్ సుబ్బరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కె అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అరగంటలో ముగించేసిన సర్వసభ్య సమావేశం

-చర్చకు రాని సమస్యలు
-పలువురు అధికారులు గైర్హాజరు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మూడు నెలలకు ఒకసారి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఉంటారు. సమావేశంలో మండలంలో ఉన్న ప్రజల సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమయ్యే దిశగా

అడుగులు వేస్తారు. కానీ కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కొంతమంది నాయకులు, అధికారులు తూతూ మంత్రంగా వచ్చి 30 నిమిషాల్లో సమావేశాన్ని ముగించేసి వెళ్లిపోయారు. దీంతో ప్రజా సమస్యలు చర్చించే వీలు కలగలేదు. పలువురు అధికారులు, సభ్యులు గైర్హాజరయ్యారు. నలుగురు మాత్రమే మాట్లాడగా ఈలోగా కొండేవరం సర్పంచ్ వేమగిరి చల్లయ్యమ్మ చెక్ పవర్ రద్దుపై, ఆమె కుమారుడు రాంబాబు, గ్రామ ఎంపీటీసీ దుల్ల సత్తిబాబు సమావేశంలో మాట్లాడుతుండగా ఎంపీపీ భర్త వాళ్ళిద్దరితో వాదించారు. సమావేశంలో చెక్ పవర్ రద్దుపై మాట్లాడకూడదంటూ ఎంపీపీ ఒక్కసారిగా బయటికి లేచి వెళ్లిపోయారు. సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలు వివరించకూడదంటూ, సర్పంచ్ కుమారుడు, గ్రామ ఎంపీటీసీ మిగిలిన సభ్యులకు వివరిస్తుండగా వారు కూడా లేచి వెళ్లిపోయారు. దీంతో సమావేశం తూతూ మంత్రంగా జరిపి అరగంటలో ముగించేశారు. సమావేశానికి హాజరైన వారందరూ ఇదేమి సర్వసభ్య సమావేశం అంటూ అవాక్కయ్యారు.

టేకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

నూతన చైర్‌పర్సన్‌గా పుట్టా జానకి రామయ్య

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : టేకి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్ పర్సన్‌గా పుట్టా జానకి రామయ్య అట్టహాసంగా పదవీ బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. నూతన పాలక వర్గంచే సీఇఓ చిక్కం విజయ్

కుమార్ నియర్ ఉద్యోగిచే బాధ్యతలు స్వీకరించారు. తన పదవీ కాలంలో సహకాన సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని ఒక దివ్యాంగునికి త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఇచ్చిన బాధ్యతను సక్రమంగా విధులు నిర్వహిస్తానని పుట్టా జానకిరామయ్య అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులపై ఎటువంటి వివక్షత చూపకుండా ఋణాలు మంజూరు చేయిస్తానని పుట్టా జానకి రామయ్య అన్నారు. పలువురు స్థానిక నాయకులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పుట్టా జానకి రామయ్యని, సభ్యులను, నరాల సూర్యనారాయణ, గంటి సీతాదేవిలను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ ప్రమాణ స్వీకారానికి స్థానిక, మాజీ సొసైటీ చైర్మన్ కుక్కల శివ సుబ్రహ్మణ్యం, మట్టపర్తి పాలరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం ఎఎఫ్‌డిటి విద్యా సంస్థలను

ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

విశాలాంధ్ర - రాజోలు : రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ రాజమండ్రి వారి విచారణ సందర్భంగా మలికిపురం ఎఎఫ్‌డిటి విద్యాసంస్థలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సిపిఐ, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, స్థానిక ప్రజలు మలికిపురంలో శు

క్రవారం విచారణ జరిపిన ఆర్జెడి ప్రతినిధి కొత్తపేట ప్రిన్సిపాల్‌కి వినతి పత్రాలు సమర్పించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఎంవీఎన్ జేఎస్ ఎండ్ ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఈ విధంగా చేయటం వలన దాతల ఆశయంతో పాటు పేద మధ్యతరగతి విద్యార్థులు అతి తక్కువ ఫీజులతో చదువుకుంటారని విచారణ అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్ దాడి సహదేవ్ పోలిశెట్టి గణేష్ ఏబీవీపీ, నక్క సంజయ్ ఏఐఎస్ఎఫ్, తాడి రవీంద్ర ఎస్ఎఫ్ఐ, ఎంవిఎన్‌జేఎస్ ఎండ్ ఆర్‌విఆర్ కళాశాల విద్యార్థులు, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఆఫ్ నిడదవోలు నూతన కార్యవరం ఎన్నిక

విశాలాంధ్ర - నిడదవోలు : వార్తల సేకరణలో స్థానిక జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారా నికి, సంఘ సభ్యుల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ప్రెస్‌క్లబ్ ఆఫ్ నిడదవోలు నూతన అధ్యక్షులు పట్టపగలు ప్రసాద్ అన్నారు. నిడదవోలు ఏబిఎస్ టౌన్ హాల్‌లో సంఘ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ

సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పట్టపగలు ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎండి జావిద్ హుస్సేన్ కార్యదర్శిగా దొడ్డిగర్ల ప్రకాష్, సహాయ కార్యదర్శిగా షరీఫ్, కోశాధికారిగా సజ్జల గంగాధర్,గౌరవ సలహాదారులుగా గరగ త్రినాధ్, గౌరవ అధ్యక్షులుగా గూడూరు వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ముప్పిడి రవితేజ,ఎల్లేరాజు, కే వసంతరాజు, అనుపోజు శివశంకర్, పాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చినకొండేపూడిలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో చినకొండేపూడి గ్రామంలో గల శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. అఖిల భారత చిరంజీవి యువత సీతానగరం మండలం వారిచే మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకొని మెగా రక్త దాన శిబిరం నిర్వహణ చేస్తున్నామని అన్నారు. అభిమానులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం ఒక మనిషి ప్రాణాలను కాపాడుతుందని కావున యువత దానిని గుర్తించి రక్త దానం చేయాలని కోరారు.

21న రాజమండ్రిలో గోదావరి గర్జన

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజా సమస్యలు తెలియడం కోసమే రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే పిలుపుతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ నాయకత్వంలో బస్సు యాత్ర ఈనెల 21 వతేదీ సాయంత్రం రాజమండ్రి కి చేరుకుంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు.

కోటిపల్లి బస్టాండ్ వద్ద గోదావరి గర్జన నిర్వహించనున్నట్టు తెలిపారు. సిపిఐ బస్సు యాత్ర సందర్భంగా గోడ పత్రికను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి 9 లక్షల కోట్లు అప్పులు చేశారని, రాష్ట్రానికి మాత్రం అభివృద్ధి శూన్య మన్నారు దేశం వెలిగిపోతుందని మోదీ చెబుతున్నారని వాస్తవంలో నిరుద్యోగం, ఆకలి పెరిగిపోతున్నదని విమర్శించారు. సీపీఐ

జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ 21వతేదీ సాయంత్రం నాలుగు గంటలకు లాలాచెరువు నుండి బస్సు యాత్ర వస్తుందని అక్కడనుండి బైక్ ర్యాలీతో స్థానిక తాడితోట జంక్షన్ దగ్గర స్వాగతం పలికి ప్రదర్శనగా కోటిపల్లి బస్టాండ్ కు చేరుకుంటుందన్నారు. అన్ని వర్గాల వారు ఈ బస్సు యాత్రను జయప్రదం చేయా లని మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు, నగర కార్యదర్శి వి. కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, లక్ష్మణ్, చింతలపూడి సునీల్, కే. జ్యోతి రాజు తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారిల సామాజిక, ఆర్థికాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో సఫాయి కర్మచారిలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిచెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల పూర్తిస్థాయి అమలుకు వివిధ శాఖల

అధికారులు సమన్వయంతో కృషిచేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డా. పీపీ వావా కోరారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్, విధానగౌతమి సమావేశ మందిరంలో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వావా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణమూర్తి, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తదితరులతో కలిసి సఫాయి కర్మచారిల సంక్షేమానికి జిల్లాస్థాయిలో తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగరపంచాయతీలు, గ్రామ పంచాయతీల స్థాయిలో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అమలుచేస్తున్న కార్యక్రమాలు, పథకాల పురోగతిని పరిశీలించారు. సాంఘిక సంక్షేమం, పంచాయతీరాజ్, మునిసిపల్, వైద్య ఆరోగ్యం, కార్మిక, పోలీస్ తదితర శాఖల అధికారులతో పాటు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో చర్చించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు అమలుచేస్తున్న ఉపకారవేతనాలు, స్వయం ఉపాధి, రుణ పథకాలను సద్వినియోగం చేసుకునేలా తోడ్పాటునందించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల జీతభత్యాలు, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్, బీమా, కారుణ్య నియామకాలు, రక్షణ చర్యలు, సేఫ్టీ ఎక్విప్‌మెంట్ తదితరాలపై కార్మికులతో మాట్లాడారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కూడా తమ అభిప్రాయాలను తెలియజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వావా సమావేశంలో చేసిన సూచనలను అన్ని స్థాయిల్లోనూ పాటించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దోకుబుర్ర భద్రం, డా. మోకా పవన్ కుమార్, బండి వీరలింగేశ్వరరావు, గంగవంశం త్రినాథ్‌దేవ్, పిల్లి జ్యోతి పాల్గొన్నారు. అదే విధంగా డీపీవో ఆర్.విక్టర్, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డీఎస్సీ కె.మురళీకృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు.

ర్యాగింగ్‌పై అవగాహన కలిగివుండాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : కళాశాలల్లో ర్యాగింగ్ చేయడం ఎంత పెద్ద నేరమో తెలిసేలా విద్యార్థులకు వారం రోజుల పాటు అవగాహన కల్పించామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజ్ నాయక్ పేర్కొ న్నారు. ఆచార్య

ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యా లయం వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరంలో ఈ నెల 12వ తేదీ నుండి 18 వ తేదీ వరకు వరకు నిర్వహించిన జాతీయ ర్యాగింగ్ నిరోధక ముగింపు వారోత్సవాల్లో డా.చవాన్ శ్యామ్ రాజ్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా విద్యార్థు లకు ర్యాగింగ్ వలన కలిగే దుష్ఫలితాలు అందులో కలిగే కష్టనష్టాల గురించి వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థుకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేల భావాలను ఒడిసిపట్టే కళ ఫోటో గ్రఫీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : వేల భావాలను ఒడిసిపట్టి తరతరాలకు అందించి అందరూ ఆశ్వాదించే కళ ఫోటోగ్రఫీ. ఈమధ్య సాంకేతిక పరమైన విప్లవాత్మక మార్పులు రావడంతో ప్రతి వ్యక్తి ఫోటోగ్రాఫరవుతున్నారు. అందమైన ఛాయా చిత్రాలను

తన కెమెరాలో బందించి చిరస్థాయిగా తన ఆల్బమ్‌లో దాచుకుంటున్నారు. కళలో నైపుణ్యం ఉంటే చిన్న చిన్న సంఘటనలు కొత్తగా ఆలోచిస్తే మదిని దోచే మరిన్ని చిత్రాలకు ఆవిష్కరణ జరుగుతుంది. సాధారణ అంశాన్ని సైతం అద్భుతంగా చూపించగలిగే సత్తా ఒక్క ఫోటోగ్రఫీ కళ లోనే ఉంది. జ్ఞాపకాల తీపిగుర్తులుగా ఉండే ఫోటోగ్రఫీ ఒకప్పుడు ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండేది. కాని కాలక్రమేణా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పేదలకు సైతం ఫోటోలు అందుబాటులోకి వచ్చాయి. సుమారు 165 సంవత్సరాల క్రితం ఎంతో మంది ఎన్నో ప్రయోగాలు చేసి ఫోటోగ్రఫీ కనిపెట్టారు. వారి కృషి ఫలితంగా నాడు ముసుగు వేసుకొని ఫోటో తీసే కెమెరా నుండి నేడు అరచేతిలో ఇమిడిపోయే సెల్ ఫోన్ వరకు ఎన్నో కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడులో 69 సంవత్స రాలక్రితం ఈశ్వర్ స్టూడియో అనే పేరుతో స్వర్గీయ సలాది పెరుమాళ్ళరావు చిన్న తాటాకుల ఇంట్లో మొట్టమొదటి ఫోటో స్టూడియో స్థాపించారు. ప్రత్తిపాడు మండలం చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చి ఫోటోలు తీసుకునేవారు. కాలక్రమంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా అనేక కెమెరాలతో ఫోటోలు తీయడంలో ఆయన కుమారుడు సలాది కృష్ణకి శిక్షణ ఇచ్చారు. కాలానికి అనుగుణంగా అనేక మార్పులతో కృష్ణ ఈశ్వర్ స్టూడియో నిర్వహిస్తున్నారు. విశేషం ఏమిటంటే స్వర్గీయ పెరుమాళ్ళ రావు ఆరోజుల్లో తీసిన ముసుగు కెమెరా నేటికీ భద్రంగా ఉండడం చెప్పుకోతగినది. కృష్ణ ఫోటోగ్రఫీ అకాడమీ ద్వారా ఎన్నో అవార్డ్స్ అందుకున్నారు. నేడు ప్రత్తిపాడు గ్రామంలో ఉన్న ఎంతో మంది ఫోటోగ్రాఫర్స్ ఆయన శిష్యులే. ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఫోటోగ్రాఫర్ కృష్ణతో ముచ్చటించడం జరిగింది.

సీఎం పర్యటన పనులు పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోటకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో శుక్రవారం సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో ట్రాఫిక్, సభకు వచ్చే ప్రజల తరలింపు, వాహనాలు నిలిపే స్థలాలు, రూట్ మ్యాప్, హెలిప్యాడ్ వద్ద

జరుగుతున్న పనులు, ఈటీసీ లేబొట్‌లో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా. రెవెన్యూ, పోలీస్, రోడ్డు రవాణా తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎం పర్యటన దృష్ట్యా సామర్లకోట చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరు పోలీస్ అధికారులతో చర్చించారు. సామర్లకోట పట్టణంలో రూట్ మ్యాప్‌లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్పీ పి. శ్రీనివాసు, పెద్దాపురం డీఎస్పీ కె లతాకుమారి, హౌసింగ్ పీడీ బి. సుధాకర్ పట్నాయక్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ

విశాలాంధ్ర - కాకినాడ : ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న ప్రత్యేక స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శు

క్రవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ..జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించవలసిందిగా ఆదేశాలిచ్చారు. జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్ర వారం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దంత వైద్యుడ్ని అందించండి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతి ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక్కొక్క దంత వైద్యుడ్ని అందించవల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు

అన్నారు. మండలంలోని జిఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజి పోస్టు గ్రాడ్యుయేషన్(ఐ ఏవోఎంఆర్)విద్యార్థుల జాతీయ సమ్మేళనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ప్రస్తుతం 66 ఆరోగ్యశ్రీ కేన్సర్ నెట్ వర్క్ హాస్పిటల్స్ ద్వారా ప్రభుత్వం చికిత్సలు చేయిస్తోందన్నారు.గ్రామాల్లో కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తే తొలిదశలో కేవలం చికిత్స అందించేందుకు అవకాశం వుంటుందని ఇందుకు వైద్య,దంత కళాశాల లు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని యాజమాన్యాలకు సూచించారు. సదస్సు అధ్యక్షులు జిఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ వైద్య రంగంలో ఒక్కక వైద్య విభాగానికి ఒక్కొక్క సారి ప్రత్యేక డిమాండ్ పెరుగుతుందన్నారు. వైద్యులు అయ విభాగాల్లో ఆధునీకరణ చెందాలని చెప్పారు. జాతీయ సమ్మేళనం ఏర్పాటుకు అడిగిన వెంటనే అంగీకారం తెలిపిన గన్ని భాస్కరరావు ప్రత్యేక కృతజ్ఞతలను ఐఏవోఎంఆర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రశాంత్ షెనాయ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజి పీజీ విద్యార్థులు ఈ కన్వెన్షన్లో పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రమ్య తెలిపారు. దీనిలో భాగంగా అధ్యక్షులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ జిఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, జిఎస్ఎల్ సంస్థల మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ గన్ని సందీప్ ప్రసం గించారు. అనంతరం కళాశాల ప్రాంగ ణంలోని సిమిలేషన్ ల్యాబ్,వివిధ నూతన వైద్య పరికరాలను పరిశీలించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జనం కోసం పవన్ -పవన్ కోసం మనం

విశాలాంధ్ర - కాకినాడ : జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా నేడు కరప మండలం వేములవాడ గ్రామంలో స్థానిక నాయకులు మీసాల రాంబాబు, అప్పనపల్లి మహేష్, అప్పనపల్లి మహేష్, శ్రీపాదం కృపాదానం, మీసాల శ్రీను, తలాటం వెంకటేశ్వరరావు, నక్క శ్రీనివాస్, వేములవాడ జనసైనికుల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు

తెలుకోవడానికి పాలిక వారి విధి, గణపతి కోలనీ, పోలీనాటి పేట ప్రాంతాలలో ఇంటింటికి జనసేన పార్టీ పిఏసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ వెళ్లారు. గ్రామంలో మహిళలు, ప్రజలు అనేక సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కరప మండల నాయకులు, కాకినాడ రూరల్ మండల నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

కళాక్షేత్రం పనులు వేగవంతం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ కళాక్షేత్ర పనులను వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కళాక్షేత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాన్ని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న కాంట్రాక్టర్, స్మార్ట్ సిటీ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ చివరి నాటికల్లా అన్ని పనులు పూర్తి చేసుకుని, వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో ఆయన వెంట కన్స్ట్రక్షన్ మేనేజర్ కామేష్, శ్రీ సూర్యరామ కన్స్ట్రక్షన్స్ ప్రతినిధులు ఉన్నారు.

కన్వర్టబుల్ స్టేడియం పనుల పరిశీలన : స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పరిశీలించారు. రూ.8.20 కోట్ల వ్యయంతో సురేష్ నగర్‌లో దీనిని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 1200 సీట్ల సామర్థ్యంతో ఈ కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణం జరుగుతుందన్నారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి వివిధ పోటీలను నిర్వహించేందుకు వీలుగా స్టేడియం నిర్మాణం జరుగుతోందన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

మూడు రోజుల్లో రూ. 30 కోట్ల మత్స్య సంపద

-35 ఏళ్ల తర్వాత సించు చేపల లభ్యం
-ఆనందం వ్యక్తం చేస్తున్న ఉప్పాడ మత్స్యకారులు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : 30 సంవత్సరాల క్రిందట ఉప్పాడ మత్స్యకారులకు చిక్కిన సించు చేపలు ఇటీవల మూడు రోజుల నుండి చిక్కడంతో సుమారు 20 కోట్ల రూపాయలు మత్స్య సంపద లభ్యమైనట్లు మత్స్యకారులు శుక్రవారం తెలిపారు. 1990లో ఉప్పాడ పరిసర ప్రాంతాల్లో లభ్యమైన సించు చేపలు గత మూడు రోజుల నుండి లభ్యం కావడంతో మత్స్యకారుల ఆనందాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. నిత్యం చేపల వేటకు వెళ్లినా చేపల లభ్యం

కాకపోవడం ఇటీవల కాలంలో సించు చేపల లభ్యం కావడంతో ఇప్పటివరకు చేసిన అప్పులు తీరుతాయని మత్స్యకారులు తెలుపుతున్నారు. సముద్రం లోపల ఉన్న చెట్లు, తుప్పలు మధ్య ఉన్న ఈ సించు చేపలు ఒక్కసారిగా ఉప్పాడ ప్రాంతంలో చేజిక్కుతున్నాయి. ఇలాగే కొనసాగితే ఉప్పాడ మత్స్యకారులు లాభాల బాట చవిచూస్తారని మత్స్యకార నాయకులు తెలుపుతున్నారు.

సించు చేప ప్రత్యేకత : సించు చేప సంధువ రూపంలో పోలి ఉంటుంది. ఈ చేప ఎక్కువ శాతం పిడుపు, ఇగురు వంటకాలు చేస్తే బాగుంటుందని పలువురు తెలుపుతున్నారు. ఈ చేప అధిక శాతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతాయి. గతంలో ఈ సించు చేపలను మత్స్యకారుల నుండి సేకరించి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు పంపించినట్లు తెలుపుతున్నారు.

ఏటా పదివేల ఉద్యోగాలు క్రీడాకారులకే

కలెక్టర్ హిమాన్షు శుక్ల

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో సాధనాల వాసు మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రారంభించారు. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటున్నారు. స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో బ్యాడ్మింటన్

పోటీలను ప్రారంభించి కలెక్టర్ శుక్ల మాట్లాడారు. పది వేలు ఉద్యోగాలు స్పోర్ట్స్ పర్సన్ కోటా ఉంది. దీనిని అభివృద్ధి పరుస్తూ యువతీ యువకులు ముందుకు రావాలని కలెక్టర్ అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న రంకి రెడ్డి కాశీకి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ క్రీడాకారుల్ని మనం తయారు చేసుకోవాలని కలెక్టర్ శుక్ల క్రీడా రంగానికి చేస్తున్న సేవ ఎనలేనిదని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఓమ్మేలు అయ్యప్ప నాయుడు, మెట్ల సూర్య నారాయణ, అమలాపురం తహసీల్దార్ శ్రీపల్లవి, గోకరకొండ నాగేంద్ర, అల్లాడ శరత్ బాబు, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, వంటెద్దు నాయుడు, కల్వకొలను బాబు, చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన 30కి వాయిదా

విశాలాంధ్ర - నిడదవోలు : ఈ నెల 22 న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిడదవోలు పర్యటన అధిక వర్షాలు నేపథ్యంలో ఆగస్ట్ 30 కు వాయిదా పడినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు లో నిర్వహించనున్న వైఎస్ఆర్ కాపు నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమం అధిక వర్షాలు కారణంగా ఆగస్ట్ 30 కి వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

నెరవేరనున్న దళితుల కల

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామ దళితుల శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటు కల ఎట్టకేలకు నియోజకవర్గ మంత్రి వనిత చొరవతో సాకారం అవుతోంది. ఎంపీపీ పోసిరాజు పెద్దేవం గ్రామస్థుడు కావటం, ఎన్నో ఏళ్ల సమస్య కు మంత్రి హామీ రూపంలో పరిష్కారం కనబడటం తో ముందుగా ఎంపీపీ పోసిరాజు గ్రామం లోని సామాజిక వర్గం వారందరిని పార్టీల కతీతం గా సమావేశ పరిచి నిర్ణయం తీసుకున్నారు. సుమారు 400 మిటర్ల పొడవునా సీసీరోడ్డు వేసేందుకు మొదట్లో 9 అడుగులు వెడల్పున రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఈ రహదారిలో ఓ ప్రక్క నున్న రైతులంతా ఎంపీపీ ఆలోచనకు వత్తాసు పలుకుతుండగా, మరోప్రక్క ఉన్న కొంతమంది రైతులు 12 అడుగుల వెడల్పున రోడ్ వేయాలని పట్టు బడుతున్నారు. గత కొన్ని ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం అవుతుందన్న విషయం వదిలి పెట్టి, పట్టుదలలకు పోతున్న వైనం కనబడుతోంది. ఈ విషయం పై ఎంపీపీ పోసిరాజు మాట్లాడుతూ దశాబ్దాల కలకు ఓ రూపం తెస్తామని, మంత్రి సహకారమే తమకు బలమని ఎంపీపీ వెల్లడించారు. శ్మశాన రహదారి పూర్తి చేయడం ఖాయమని ఆయన తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో మానవత అగ్రస్థానం

విశాలాంధ్ర-దేవరపల్లి: స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో మానతా సంస్థ అగ్రస్థానంలో ఉందని మానవతా సంస్థ జిల్లా కన్వీనర్లు బోయపాటి రామలక్ష్మి కేశిరాజు రాజ్ కుమార్ వెల్లడించారు. మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరపల్లిలో బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ మానవతా సంస్థ ఆవిర్భవించినప్పటి నుండి

రాష్ట్రంలో ప్రధాన కేంద్రాలలో మండల కేంద్రాలలో మానతా సంస్థల శాఖలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరపల్లి మండల శాఖ ద్వారా శాంతి ర్యాలీ నిర్వహించామని అన్నారు. మానవతా సంస్థ సీనియర్ నేతలు బల్ల సూరి చక్రం పచ్చ రాంగోపాల్ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ తదితరులు మానవతా సంస్థ చేస్తున్న సేవలను విశదీకరించారు ఈ సందర్భంగా దేవరపల్లి బస్టాండ్ వద్ద నుండి బిహెచ్ఎస్ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సంస్థ మండల అధ్యక్షుడు ఈదుపుగంటి నాగేశ్వర రావు, మానవతా సంస్థ నేతలు పప్పు వెంకట రామారావు, యలమాటి సత్యనారాయణ, బండి సూర్యప్రకాశరావు, పచ్చ రాంగోపాల్, కేశిరాజు రాజకుమార్ తీగల లక్ష్మీనారాయణ గద్దె కృష్ణారావు దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ విఎల్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక శిథిలావస్థలో మరుగుదొడ్లు

విశాలాంధ్ర - సీతానగరం: నిర్వహణ లేక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలో సీతానగరం గ్రామంలో గల ఆర్ టి సి ప్రధాన బస్టాండ్ అవసరాల నిమిత్తం నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. లక్షల రూపాయల ప్రజా ధనం వెచ్చించి ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన వాటిని కనీస పరిశుభ్రత, నిర్వహణ లేక పోవడంతో నేడు పిచ్చి

మొక్కలు, గడ్డి పెరిగి పడిపోవడానికి సిద్ధమయ్యాయి. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు, ప్రయివేటు, ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్య ప్రజలు రాజమహేంద్ర వరం ప్రయాణం చేస్తూ ఆర్‌టిసికి ఆదాయం తెచ్చి పెడుతున్నారు. అలాంటి ఈ బస్టాండ్ నిర్వహణ సంబంధిత శాఖ అధికారులు గాలికి వదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేపట్టి మరుగు దొడ్లను తిరిగి ప్రయాణికులకు వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

వణుదుర్రు సర్పంచ్ ఎన్నికకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రితో వణుదుర్రు చేరుకున్నారు. వణుదుర్రు గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు కొత్తపల్లితో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ 1613 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇక్కడ నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక్కడ సర్పంచ్ ఎన్నిక బరిలో ఉన్న అభ్యర్థులు వారిని బలపరిచిన ప్రధాన పక్షాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మండలంలోని పెయ్యేరు 2వ వార్డు ఎన్నిక ఏకగ్రీవమైంది. సర్పంచ్ ఎన్నిక పైన మండల ప్రజలు దృష్టి కేంద్రీకరించారు.

మంచినీటి పంపింగ్‌పై పర్యవేక్షణ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ :పట్టణంలో భారీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ (మంచినీటి చెరువు) నుండి పైపులైన్ ద్వారా ఓహెచ్ఆర్ లకు త్రాగునీరు పంపింగ్‌కు నిత్యం పర్యవేక్షణ ఉంటుందని దీనికి సంబంధించి సీసీ కెమెరాలను ఓ హెచ్ ఆర్ ల లోపల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శివారు ప్రాంతాలలో కొన్నిచోట్ల త్రాగునీరు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అధికారులతో సమీక్ష చేసినట్లు తెలిపారు. పంపింగ్ విధానంలో అక్కడక్కడ లోపాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, ఇందుకోసం ఓ హెచ్ ఆర్ ల లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల రోజులో పంపింగ్ ఎంత జరిగిందనేది తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం అయినప్పటికీ కూడా శివారు ప్రాంతాల్లోని కొన్నిచోట్ల త్రాగునీటి ఇబ్బంది ఉండడంతో ఆ ప్రాంతాలకు వాటర్ ట్యాంకులను పంపిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

విద్యను కార్పొరేటీకరణ చేస్తున్న పాలకులు

విశాలాంధ్ర-ఏలూరు: కొత్త బస్టాండ్ సమీపంలోని అల్లూరు సత్యనారాయణ భవన్ లో పిడిఎస్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాసంస్కరణల పేరుతో విద్యా రంగంలో అనేక మార్పులను తీసుకువస్తూ విద్యను మొత్తంగా కార్పొరేట్ల పరం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారని అన్నారు. దానిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఇ పి - 20 20 తీసుకొచ్చిందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ముందుగా మన రాష్ట్రంలో అమలు చేస్తూ పాఠశాల విలీనం, సీబీఎస్ఈ సిలబస్, తెలుగు మీడియం రద్దు, సెమిస్టర్ విధానం వంటి వాటిని అమలు చేస్తున్నారన్నారు. మరోవైపు హేతుబద్ధీకరణ పేరుతో టీచర్ పోస్టులు రద్దు చేసి ఉన్న టీచర్లకు అధ్యాపకేతర పనులు అప్పగించి ఉపాధ్యాయులను తరగతి నుండి దూరం చేస్తున్నారని విమర్శించారు.

పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 107,108 జీవోలు తీసుకొచ్చి పేద, దళిత, ఆదివాసి విద్యార్థుల వైద్య విద్యా అవకాశాలను దెబ్బతీస్తూ వైద్య విద్య ను అత్యంత ఖరీదైన సరుకుగా మారుస్తుందని విమర్శించారు. ఈ జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవ యువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.భాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల 30 వేల పోస్టులను, కేంద్రంలో ఉన్న 60 లక్షల పోస్టులను కేంద్ర, రాష్ట్ర పాలకులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ బాడీ సమావేశానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి 150 మంది విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.తదనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో వైద్య సీట్ల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ కొత్త బస్టాండ్ నుండి ఫైర్ స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-ఉంగుటూరు:ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామపంచా యతీలో 1,5 వార్డులకు శనివారం ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ వార్డులకు సంబంధించి రెండు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఉంగుటూరు తహసీల్దార్ ఏవి రమణారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయబాబు, ఈవోపీఆర్డి షేక్ సంసిద్దిన్ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని అందజేశారు. ఒక్కొక్క వార్డుకు 140 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్కొక్క వార్డుకు ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రెండు వార్డులకు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసామని అధికారులు తెలిపారు. రెవిన్యూ, సిబ్బంది కూడా ఉన్నారు. వార్డుల ఉప ఎన్నికల సందర్భంగా కాకర్లమూడి గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళ పోలీసులు కాకర్లమూడి గ్రామానికి చేరుకున్నారు. వార్డు ఉప ఎన్ని కల్లో ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు పటిష్టమైన ఏర్పాటు చేశారు.

సిసి రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-ఆకివీడు : దశాబ్దాల కాలం నుండి సుదీర్ఘ నిరీక్షణతో ఆకివీడు నగర పంచాయతీ పదో వార్డ్ లోని గంగానమ్మ కోడు వీధి శివారులో సుమారు 106 మీటర్ల సిసి రోడ్డును నిర్మించడం పట్ల అక్కడ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. నరసాపురం పార్లమెంట్ సభ్యులు రఘురామకృష్ణం రాజు నిధుల నుండి రూ.10లక్షలు ఈ సి సి రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. అవార్డు వైసిపి ఇన్‌చార్జి జోగి నాగరాజు, కాంట్రాక్టర్ మార్గాన్ని కనక దుర్గారావు, వలంటరీ ఈరి శ్యామ్ రోడ్డు నిర్మాణ పనులను దగ్గరుండి పరిశీలించారు.

అధునాతన సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్ :అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు గ్రంథి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో లేటరల్ ఎంట్రీ ద్వారా బి టెక్. రెండవ సంవత్సరంలో ప్రవేశాలు తీసుకున్న విద్యార్థులకు వారం పది రోజుల పాటు నిర్వహించనున్న బ్రిడ్జి కోర్సు శిక్షణను శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంథి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సును పూర్తి చేసుకుని ఈసెట్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులై కౌన్సెలింగ్ ద్వారా నేరుగా బి.టెక్. రెండవ సంవత్సరంలో ప్రవేశించే మీరు ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కంటే ఎక్కువ పరిజ్ఞానాన్ని సంపాదించుకుని ఉంటారని దానిని కొనసాగిస్తూ చక్కగా చదువుకోగలిగితే మంచి భవిష్యత్తును సాధించడం సులువు అవుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవాటు చేసుకున్నట్లయితే భవిష్యత్తులో కూడా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉండగలరన్నారు. కొన్ని ప్రత్యేక పాఠ్యాంశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యిచ్చిన శిక్షణను మీరు మిస్ అవకూడదనే ఉద్దేశ్యంతో రెండవ సంవత్సరం తరగతులు ప్రారంభానికి ముందే మీకు కూడా ఆయా అంశాలపై శిక్షణను అందించడం జరుగుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు, టెక్నికల్ డైరక్టర్ చక్కా అప్పారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ రాంబాబు అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి తోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర-ఆకివీడు : టిడిపి తోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామంలో శుక్రవారం మహాశక్తి కార్యక్రమంలో భాగంగా టిడిపి మేనిఫెస్టోను విస్తృత ప్రచారం చేశారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి మేనిఫెస్టో వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం ఇబ్బందులను వివరిస్తూ రానున్న కాలంలో అభివృద్ధి వైపు పయనించేలా ప్రజలంతా చంద్రబాబుకు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆకివీడు పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, భూపతి రాజు తిమ్మరాజు, ఆకివీడు నగర పంచాయతీ కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, కిమిడి నాగరాజు, మోపిదేవి శ్రీను, బత్తుల రవి, మీగడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : జగనన్నతోనే సంక్షేమం,అభివృద్ధి సాధ్యమని, 2024 ఎన్నికల్లోను వైకాపా విజయం సాధించి వైయస్ జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ ప్రభుత్వం ఇలాగే కొనసాగుతుందని ప్రజలకు చాటి చెప్పాలని జగనన్న సచివాలయం కన్వీనర్లు (జె సి ఎస్) కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైకాపా కార్యాలయంలో శుక్రవారం జరిగిన జె సి ఎస్ శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవసరం ఏమిటనేది ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. పిల్లలను చదివించే తల్లులకు అమ్మ ఒడి రావాలన్నా, ఉన్నత విద్యను అభ్యసించే వారికి విద్యా,వసతి దీవెన కావాలన్నా, రైతన్నలకు రైతు భరోసా ఇవ్వాలన్నా, 45-60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలకు కాపు నేస్తం, ఈ బీసీ నేస్తం కొనసాగాలన్న, పేదవాడు సొంత ఇంటి కల నెరవేరడానికి, అవ్వ తాతలకు పెన్షన్లు ఇవ్వడానికి ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడానికి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవసరం ఉందనేది ప్రతి ఒక్కరికి సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి చాటి చెప్పాలని మంత్రి కొట్టు సూచించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండలం గ్రామ సచివాల యాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, తాడేపల్లిగూడెం పట్టణం వన్ టౌన్ వార్డు సచివాలయాల కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, టూ టౌన్ వార్డు సచివాలయాల కన్వీనర్ కర్రి భాస్కరరావు, పెంటపాడు మండలం గ్రామ సచివాలయాల కన్వీనర్ మైలవరపు పలువురు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, వార్డు ఇన్చార్జిలు, గ్రామ,వార్డు సచివా లయాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడిసిన్ సీట్ల అమ్మకాన్ని ఆపాలి

విశాలాంధ్ర-పెంటపాడు: మానవత స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 16వ తేదీ నుండి 22 వ తేదీ వరకు నిర్వహించు వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెంటపాడు రూరల్ సిఐ వివిఎస్ మూర్తి మానవత శాంతి ర్యాలీని పెంటపాడులోని ఎస్ టి వి ఎన్ హెచ్ పాఠశాల వద్ద ప్రారంభించారు. 250 మంది పాఠశాల విద్యార్థులతోను, మానవత సభ్యులతోను, ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ ర్యాలీ కొనసాగుతూ పెంటపాడు గాంధీ బొమ్మ సెంటరు వద్ద మానవహారంగా ఏర్పడి మానవత శాంతి నినాదాలతోను, పర్యావరణ పరిరక్షణ కొరకు, విద్య ఆవశ్యత, పరిశుభ్రత కోసం నినదిస్తూ, విద్యార్థులు ప్లైకార్డులు , మానవత జెండాలతోను ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బజార్ సెంటర్ నుండి ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాల వరకు సాగింది. మానవత సభ్యులతో మానవత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహన రావు శాంతి ప్రతిజ్ఞను చేయించారు. ర్యాలీ ముగిసిన అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, లేస్ ప్యాకెట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ శశి కపూర్ ,మానవత సభ్యులు టి.పాల్, వై. వీరాస్వామి, ఎన్ . ప్రభాకర రెడ్డి, జార్జ్ జి. కృష్ణ మోహన్ ,కె. నారాయణ రావు, మానుకొండ మార్క్స్,జి. శ్రీనివాస్ ,స్కూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

విశాలాంధ్ర-కైకలూరు : రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడని,దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ అని రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు పోసిన చెంచు రామారావు తెలిపారు. పట్టణం లోని తాలూకా సెంటర్లోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 373వ జయంతి వేడుకలు కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై సర్వాయి పాపన్న గౌడ్ ఖ్యాతిని వివరించారు. జై గౌడ ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి పరసా ఏడుకొండలు మాట్లాడుతూ కైకలూరు పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కాళ్లపాలెం డాక్టర్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి అనుమతులు మంజూరు చేయడానికి స్థానిక నేతలు కృషి చేయాలని విన్నవించారు. సభాధ్యక్షులు కైకలూరు మండల ప్రధాన కార్యదర్శి మారగాని గణపతి మాట్లాడుతూ గౌడ సంఘాన్ని బలోపేతం చేయాలని దాని దిశగానే మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని సాయంత్రం కలిదిండి మండలం ఎస్ ఆర్ పి అగ్రహారంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు యార్లగడ్డ గోవర్ధన్,బొల్లా శ్యామల రాజు గౌడ్, కైకలూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పోలగాని నాగరాజు, గోనెపాడు సర్పంచ్ బత్తిన శ్రీకాంత్, నంగెడ్డ శివ, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర-వీరవాసరం: రహదారి ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత సూచనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఏఎస్పి ఏవి.సుబ్బరాజు తెలిపారు. మండలంలోని రాయకుదురులో చట్టాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిపై ప్రయాణం చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్ లను, హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకున్నా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎస్ఐ పి.రమేష్, గెడ్డం భాస్కరరావు, సర్వేశ్వరరావు, పివి రామకృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, తాడాల దుర్గా ప్రసాద్, తోట పెద్దిరాజు, వెలిదిండి దయానంద్, చెల్లబోయిన రామలింగేశ్వర రావు, సింహాద్రి సాయి రాజేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడంగి పంచాయతీలో డస్ట్ బిన్లు పంపిణీ



విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని వేడంగిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఇంటింటికీ డస్ట్ బిన్లు పంపిణీ కార్యక్రమాన్ని నియోజక వర్గ వైసీపీ ఇన్ చార్జ్ గుడాల గోపి శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక మహిళలకు డస్ట్ బిన్లు అందచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణకు పంచాయతీ అందచేస్తున్న డస్ట్ బిన్ లు ఉపయోగిస్తూ గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు తమ తోడ్పాటు నందించాల న్నారు. నియోజకవర్గం వైసీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, యెడ్ల తాతాజీ ,పోడూరు జడ్పిటీసి గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ చెల్లబోయిన శారద తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెనుమంట్ర:పెనుమంట్ర మండల మానవత సంస్థ ,రత్న డెంటల్ క్లినిక్ పెనుగొండ వారి అధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం పెనుమంట్ర గ్రామంలో శ్రీ గౌతమి స్కూల్ నందు శుక్రవారం ఏర్పాటు చేశారు. సుమారు 150 విద్యార్ధిని విద్యార్ధుల కు ఉచితం గా దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. శిబిరం లో డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, డాక్టర్ షాలిని రెడ్డి, మానవత అధ్యక్షులు బాబాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకోసం పనిచేయాలి

విశాలాంధ్ర -దేవరపల్లి: కృషి, పట్టుదల, ఆత్మస్థైర్యం ఉంటే అవార్డులు వరిస్తాయని ఈ విషయంలో ప్రతి ఉద్యోగి ప్రజల కోసం పనిచేయాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న దేవరపల్లి ఎంపీడీవో కృష్ణంరాజును కార్యాలయ సిబ్బంది రాజకీయ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ కృష్ణంరాజు 15 సంవత్సరాల పాటు మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవంతో ఎంపీడీవో గా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తున్నారని అన్నారు. కృష్ణంరాజు సేవలు దేవరపల్లి మండల పరిషత్‌కు ఎంతో అవసరమని అన్నారు. జడ్పిటిసి పొట్టి స్వర్ణలత, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ జనార్ధన రావు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ లు కృష్ణంరాజు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది ఎంపీపీ కేవీకే దుర్గారావు ఎఎంసి చైర్మన్ జనార్ధన రావు మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ వైఎస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ సాది సుబ్బారావు గ్రామ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

నారాయణపురంలో శాంతి ర్యాలీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురంలో మానవత ఆవిర్భావం సందర్భంగా శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఉషోదయ హైస్కూల్ నుంచి జాతీయ రహదారి వరకు జరిగింది. రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, అధ్యక్షులు గంజి రవి, అడపా శ్రీనివాసరావు, బొమ్మిడి అప్పారావు, సూర్యనారాయణ రాజు, అడపా శోభారాణి, పిళ్ళ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : గత 20 సంవత్సరాలుగా స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు అన్ని హక్కులు ఉన్నా నిర్వాసి తులు అడ్డుపడుతున్నారని ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి. అంకంపాలెం పంచాయతీ పరిధిలో పి. నారాయణపురం గ్రామంలో 2003 సంవత్సరంలో స్థానిక గిరిజనులకు పట్టాలి ఇచ్చారని అన్నారు. అప్పటి నుండి గిరిజనులు సాగు చేసుకుంటుంటే గాజుల గుంది నిర్వాసితులు ఇప్పుడు అడ్డు వస్తున్నారన్నారు. హైకోర్టు ఆర్డర్లు ఉన్న మాకు న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీరే న్యాయం చేయాలి అని కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. 1/70 చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

గుంతలకు దిక్కులేదు

విశాలాంధ్ర -భీమవరం: జగన్ రాష్ట్రంలో రోడ్లు కాదు కదా గుంతలను కూడా పూడ్చలేకపోతున్నాడని మూడు రాజధానులు ఎలా నిర్మిస్తాడని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రశ్నించారు. శిధిలావస్థకు చేరిన బలుసుమూడి-కొమరాడ రోడ్డు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు సెల్ఫీ ఫోటోలతో సోషల్ మీడియాలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 90 శాతం నిర్మాణాలు జరిగినటువంటి టిడ్కో ఇళ్లు, పోలవరం ఇతర ప్రాజెక్టులను నాలుగేళ్లవుతున్నా పూర్తి చేయలేని అసమర్ధపు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం శంకుస్థాపనలతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, మాజీ కౌన్సిలర్ పామర్తి వెంకటరామయ్య, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు లభిస్తున్నయనీ, అందుచే విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకో వాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య కె.పద్మ రాజు అన్నారు. నన్నయ వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్టమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బిట్ క్లబ్ ఆధ్వర్యంలో "అప్ స్కిల్" అనే అంశంపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరడానికి మంచి లక్షణాలను, విలువలను అలవర్చుకోవాలన్నారు. విద్యతో పాటు వివిధ స్కిల్స్ ను పెంచు కోవాలని, ఇంటర్వ్యూల సమయంలో వాటి ఆధారంగానే ఉద్యోగాలు లభిస్తాయని ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఐక్యూ.ఎ.సి డైరెక్టర్ డాక్టర్ వి.పెర్సిస్, విభాగాధిపతి డాక్టర్ బి.కెజియారాణి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.దాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చంద్రబాబుకు వినతిపత్రం

విశాలాంధ్ర - మండపేట : మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా మండపేట విచ్చేసిన సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను వివరించడానికి ఏపీ ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు సంజయ్ వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జంకి సుధాకర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంద్రకోట తిమోతి మాదిగ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తాతపూడి మూర్తి, తూర్పుగోదావరి జిల్లా ఇన్ చార్జి కందుకూరి రాజు మాదిగ, యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిపూడి రాజు మాదిగ తదితరులున్నారు.

చంద్రబాబును కలిసిన జయరాజు

విశాలాంధ్ర - మండపేట : మండపేట పర్యటనలో ఉన్న మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు మాదిగ కలిసి వినతిపత్రం అందజేసారు. సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ నాయకులు గాలింకి నాగేశ్వరావు, దూలి ప్రవీణ్, టీడీపీ నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి ప్రదీప్, మచ్చ రాంబాబు, సిరంగుల రాజు, రాయి దొరబాబు, కొడమంచిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరపలో ఫ్రైడే డ్రై డే

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో వివిధ కాలనీలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపిహెచ్ఓలు, హెచ్ వీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఆధ్వర్యంలో నిర్వహించుట జరిగిందని మండల మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. కాలనీలలో ఉన్న డ్రైనేజీలలో దోమల వ్యాప్తి చెందకుండా మందులు పిచికారి చేయుట, నాఫ్తలిన్ పిల్స్ వేయుట, ఇంటి ఆవరణలో ఉన్న చెత్తాచెదారం తొలగించి, కొబ్బరి బొండాలు, టైర్లు, రుబ్బురోలు నిలవ నీరు ఉండే ప్రదేశాలు లేకుండా, సూపర్ పలుచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. తడిగా ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ ముగ్గు వంటి పౌడర్లను చల్లడం జరిగిందన్నారు.

దొంగ అరెస్ట్

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణం సత్యనారాయణపురంలో మహిళ మెడలో బంగారు తాడు దొంగలించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న దొంగను ట్రాఫిక్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల సమయంలో సామర్లకోట సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన మహిళలు రైల్వే స్టేషన్‌కు నడిచి వెళుతుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జి కిందకు రాగా అప్పటికే పొంచి ఉన్న దొంగ ఒక మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకొని పారిపోతుండగా. మహిళ కేకలు పెట్టడంతో వంతెనపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు తక్షణమే స్పందించి మోటారు సైకిళ్లపై వెళ్లి దొంగను వెంటాడి పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందినవాడిగా గుర్తించామని, అతడు పాత నేరస్థుడు అని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు చట్టాలపై సదస్సు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్: శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు లేబర్ డిపార్ట్మెంట్ వారి సమన్వయంతో స్థానిక ఆటోనగర్‌లోని ది రాజమండ్రి పట్టణ మోటార్ మెకానిక్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్‌లో దుకాణాలలో పనిచేస్తున్న కార్మికుల చట్టాల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో కార్మిక హక్కులు, వివిధ కార్మిక చట్టాల గురించి వివరించారు. కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పని చేయాలని సూచించారు. రాజ్యాంగంలో పొందుపరచిన ఉచిత, నిర్బంధ విద్యహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుండి 14 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారి హక్కు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ డిపార్ట్మెంట్ సిబ్బంది ఎ. విజయ ప్రకాష్, ఎ. ఎల్.ఒ. ఎం. లలిత కుమారి, ఇతర ఎ. ఎల్.ఒ లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ప్రత్యేక వైద్య సేవలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడవ శుక్రవారం స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఆర్ ప్రసాద్ తెలిపారు. ప్రసూతి స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ మృదుల 12 మందిని, చెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ మేరి వసంత నలుగురిని పరీక్షించి, తగిన సూచనలు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలలో మూడవ శుక్రవారం, నెలలో ప్రతి శనివారం స్పెషలిస్ట్ వైద్య సేవలు ఆరోగ్య కేంద్రంలో అందజేస్తున్నట్లు, ఆయా సంబంధిత అనారోగ్యం కలిగిన వారు తప్పనిసరిగా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు.

గ్రామ చరిత్ర గ్రంథస్తం అభినందనీయం

విశాలాంధ్ర - అనపర్తి: అనపర్తి గ్రామ చరిత్రను గ్రంథస్తం చేయడం అభినందనీయమని ఈవిధంగా ప్రతీ గ్రామ చరిత్ర గ్రంథస్తం చేయాల్సిన అవసరం ఉందని గ్రామ సర్పంచ్ వారా కుమారి, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్ రెడ్డి అన్నారు. ఇటీవల ఉత్తమ రచయిత అవార్డ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కె మాధవీలత, జిల్లా ఇన్చార్జ్ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాల కృష్ణ చేతులు మీదగా అందుకున్న సీనియర్ పాత్రికేయులు,సామాజిక, ఆధ్యాత్మిక రచయిత పి.సాయిప్రకాష్ ను స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో అనపర్తి పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రీ సర్వేలో ప్రగతి సాధించాలి

విశాలాంధ్ర-భీమవరం: రీ సర్వేలో పశ్చిమగోదావరి జిల్లా మంచి ప్రగతిని సాధించాలని జిల్లా జాయింటు కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి రీ సర్వే, భూమి బదిలీ హక్కులు కల్పించుటపై జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్లు, మండల సర్వే అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచించారు. ప్రతి రైతుకి నోటీస్ అందించాలని తహసీల్దారులకు తెలిపారు. తొలి విడత రీ సర్వేలో పశ్చిమగోదావరి జిల్లా మంచి ప్రగతిని సాధించిందని, రెండో విడతలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి జాషువా, భూ విభాగం పర్యవేక్షకులు సిహెచ్. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తులు చేసుకోండి

విశాలాంధ్ర -భీమవరం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలు పొందదానికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను సమాయత్తం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జవహర్ నవోదయ స్కూల్సులో 20-1-2024వ తేదీన ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని, వీటికి ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జవహర్ నవోదయ.గవ్.ఇన్ వెబ్ సైట్ లో సందర్శించాలని ఆయన సూచించారు. జిల్లాలోని ఎంఇఒలు తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వీటిపై అవగాహన కలిగించాలని ఆయన ఆదేశించారు.